క్లుప్తంగా

తీరిన తాగునీటి సమస్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుతో విన్నవించగా వెంటనే ఆయన స్పందించి బోరు వేయించారని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, విండో చైర్మన్ కమలాకర్ రావు, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు కవీన్, గ్రామ అధ్యక్షుడు చిందం రాజయ్య తదితరులున్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

గాంధారి(ఎల్లారెడ్డి) : యాసంగిలో సాగు చేసిన పంటలకు రైతులు మోతాదుకు మించి యూరియాను వేయొద్దని ఎల్లారెడ్డి ఏడీ రత్న అన్నారు. మంగళవారం ఆమె ఏవో నరేష్‌తో కలిసి గుజ్జుల్, దుర్గం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు నివారణకు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సి చర్యలు, పిచికారి చేయాల్సిన పురుగు మందులను సూచించారు. పీఎం కిసాన్ యోజన కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోకుంటే డబ్బులు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులున్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు సుజాత, భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఆదర్శ భావాలను కలిగి ఉండి మహనీయుల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్ రావు, మనోహర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, శివాజీ రావు, సుధాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : సైబర్ నేరాలకు బలికావద్దని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రవీంద్ర భారతి హైస్కూల్‌లో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలకు వచ్చేదారుల్లో ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపవద్దన్నారు. సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, ఇర్ఫాన్ సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జి కానిస్టేబుల్ శ్రీను, సుప్రజ, పాఠశాల ప్రిన్సిపాల్ స్వామి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల అందజేత



బీబీపేట : మండలంలోని యాడారం ప్రభుత్వ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వైస్ చైర్మెన్ నాగరాజ్‌గౌడ్ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్‌లను, స్నాక్స్‌ను అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మెన్ నాగేశ్వర్, వైస్ చైర్మెన్ స్వామి, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కరపత్రాల పంపిణీ



దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓటరు ప్రతిజ్ఞ కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లితండ్రులతో కరపత్రాలను చదివించి ఓటుహక్కు వినియెగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు



దోమకొండ శివరాంమందిర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

దోమకొండ : మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజు రోజువారి ఉత్సవాలు జరుగుతాయని ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజు తెలిపారు. మంగళవారం గణపతిపూపూజ, పుణ్యావచనం అఖండదీపారాధన నిర్వహించారు. శేషసాయిపై స్వామివారి ఊరేగింపు జరిపారు. 6వ తేదీ బుధవారం ప్రాతఃకాల పూజలు, వాస్తు క్షేత్ర పాలక పూజలు ఉంటాయి. అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం, ధ్వజారోహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7వ తేదీ గురువారం స్థాపిక దేవతా హవనం, పూజలు, రుద్రహవనం, శేషసాయిపై స్వామివారి ఊరేగింపు ఉంటాయి. 8వ తేదీన శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా గంగాన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం, అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటాయి. రాత్రి నిశిపూజ, స్వామివారి రథోత్సవాలు, గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి రథోత్సవాలు, లంకాదహనం నిర్వహిస్తారు. 9న శనివారం జాతర కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తామని ఆయన తెలిపారు. ఉత్సవాల కొంసం ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

ఓంశాంతి కేంద్రంలో..

కామారెడ్డి అర్బన్ : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేది బుధవారం నుంచి 9వ తేది వరకు మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా సహస్రలింగాల దివ్య దర్శనం, అమర్‌నాథ్ శివలింగ దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి జయదీదీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9 వరకు అనుమతి ఉంటుందని వారు పేర్కొన్నారు.

బీజేపీ సభకు తరలిన నాయకులు



ప్రధాని మోదీ విజయ సంకల్ప సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం ప్రజా సంకల్ప యాత్రకు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం, రాంచందర్, మురళి, సాయన్న, బాలయ్య, పోశెట్టి, గణేశ్‌తో పాటు పలువురు ఉన్నారు.

రాజంపేట: హైద్రాబాద్ పటాన్ చేరు లో ప్రధాని నరేంద్ర మోది ఆధ్వర్యంలో జరగనున్న బీజేపి విజయ సంకల్ప యాత్ర కు మంగళవారం రాజంపేట మండల బీజేపి నాయకుల భారీగా తరలివెళ్ళారు.తెలంగాణ లోని 17 ఎంపీ సీట్లకు 17 స్థానాలు బీజేపి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నిజాంసాగర్(జుక్కల్) : ప్రధాని మోదీ సభకు మంగళవారం మహమ్మద్‌నగర్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాల పఠాన్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు బీజేపీ నాయకులు వాహనాల్లో తరిలారు. బీజేపీ నాయకులు సతీష్, రౌతు. రాజు, యాదయ్య,విఠల్, మనేందర్ తదితరులు ఉన్నారు.



చిన్నమల్లారెడ్డి నుంచి..

ఎల్లారెడ్డి : సంగారెడ్డిలో నిర్వహించే ప్రధాని మోదీ సభకు ఎల్లారెడ్డి నుంచి నాయకులు మంగళవారం తరలివెళ్ళారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకిషన్, దేవేందర్, బాలరాజు, రాజేష్ తదితరులున్నారు.

కామారెడ్డి రూరల్ : పటాన్ చేరులో ప్రధాన మోదీ విజయ సంకల్ప యాత్ర కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి మండలం నుండి భారీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తే జైలుకే..



షాకీర్ అహ్మద్ ఎక్సైజ్ సీఐ

లింగంపేట(ఎల్లారెడ్డి) : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా బెల్ట్ షాప్‌లపై నిఘా ఏర్పాటు చేసినట్లు ఎల్లారెడ్డి అబ్కారీ సీఐ షాకీర్ అహ్మద్ వెల్లడించారు. మంగళవారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు షాప్‌లు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎల్లారెడ్డి ఎక్సైజ్ పరిధిలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి నాలుగు మండలాల్లోని గ్రామాల్లో బెల్టు షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటిదాకా ఎల్లారెడ్డి ఎక్సైజ్ పరిధిలో మూణ్నెళ్లలో 22 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 19 మందిని అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసుల్లో 297 లీటర్ల మద్యం, 41 లీటర్ల బీరును సీజ్ చేసినట్లు వెల్లడించారు. 7 వాహనాలను సీజ్ చేశామన్నారు.

బ్యాక్టీరియా నివారణ చర్యలు చేపట్టాలి



బీబీపేట: వరి పొలాల్లో ప్రస్తుతం వాతావరణం వల్ల బాక్టీరియా ఆకు ఎండు తెగులు సోకుతుందని వాటి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం బీబీపేట మండల కేంద్రంతో పాటు మల్కాపూర్ గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. ఎండు తెగులు నివారణకు స్ట్రెప్టోమైసీన్ సల్ఫేట్ 9 శాతం 100 గ్రాములు, వలిడామైసీన్ 3 శాతం, ఎల్ 500 మి.లీ. ఎకరానికి చొప్పున పిచికారి చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో రాఘవేంద్ర, రైతులు ఉన్నారు.

పీఎం విశ్వకర్మ దరఖాస్తులపై విచారణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేటలో మంగళవారం ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. విచారణలో భాగంగా గ్రామంలోని దరఖాస్తుల వద్దకు వెళ్లి ఆయన వివరాలను సేకరించారు. అనంతరం జీపీలో రికార్డులు పరిశీలించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్, జీపీ కార్యదర్శి భూమేశ్వర్ ఉన్నారు.



గోపాల్‌పేటలో విశ్వకర్మ దరఖాస్తుదారు నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎల్‌పీవో సురేందర్

విద్యార్థులకు క్రీడలు



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నిస్ క్రీడలను నిర్వహించారు. నెహ్రూ కేంద్రంను 1972లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని అనిల్ రాథోడ్ అన్నారు. ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ, నరేష్, సాయిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

రాజంపేట : జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను సురేష్ షెట్కర్‌కు కేటాయించడంపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజంపేట గ్రామ అధ్యక్ష పదవి ఖాళీగా ఉన్న విషయాన్ని పార్టీ పెద్దలకు తెలిపామన్నారు. మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు జూకంటి సుధాకర్ రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు బెస్త చంద్రం, వార్డ్ నెంబర్ ఇమ్రాన్ అలీ, మైనారిటీ అధ్యక్షులు షాదుల్, కటికి అబ్దుల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు భీమయ్య తదితరులున్నారు.

అనుమతి లేని భవనాన్ని కూల్చివేయాలి

బాన్సువాడ : బాన్సువాడ- బోధన్ రోడ్డులో మున్సిపాలిటీ అనుమతి లేకుండా నిర్మించిన భవనాన్ని వెంటనే కూల్చి వేయాలని కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నేత కాసుల బాల్‌రాజ్ అన్నా రు. మంగళవారం బాన్సువాడ మున్సిపాలిటీలో జరిగిన బడ్జెట్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఓ వ్యాపార వేత్త కొందరు అమాయకులను బెదిరించి అక్రమంగా స్థలా న్ని తక్కువ ధరకే కొని అనుమతుల్లేకుండా భవనం నిర్మించారన్నారు. వెంటనే భవనాన్ని కూల్చివేయాలని, లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని హజ్గుల్‌లో మైనార్టీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి మంగళవారం పీసీసీ డెలిగెట్ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ భూమి పూజ చేశారు. ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుకు వినతిపత్రం ఇవ్వగా వెంటనే రూ. 5 లక్షలు మంజూరు చేశారన్నారు. మండలంలో అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు కమల్‌కిషోర్, నాగ్‌నాథ్, మైనార్టీ నాయకులు రషీద్, మునీర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేటలోని ఆర్టీసి బస్టాండ్‌ను మంగళవారం స్థానిక ఎంపీపీ రాజ్‌దాస్ జీపీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా రోడ్డుపైనే నిలపడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నందున బస్సులు లోపలికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండల కో-ఆప్షన్‌సభ్యుడు షాహెద్‌పాషా, కాంగ్రెస్ నాయకులు ఇమామ్, నర్సింహారెడ్డి, గులామ్, కిషన్, గణేష్, విక్రమ్ తదితరులున్నారు.

లెక్చరర్లకు సన్మానం



కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగం సాధించిన లెక్చరర్లను మంగళవారం ఆర్కే కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.జైపాల్ రెడ్డి సన్మానించారు. చిరంజీవి, మధుసూదన్, రవి చంద్రలు తమ కళాశాలలో చాలా ఏళ్లుగా మంచి బోధనలే చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దత్తాద్రి తదితులున్నారు.

నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రం నుండి బాన్సువాడ వరకు నస్రుల్లాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరారు. మంగళవారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరికలు ఉండటంతో పీఏసీఎస్ చైర్మన్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ కిషోర్ యాదవ్ అధ్వర్యంలో 500 మంది కార్యకర్తలు జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుదర్శన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుకున్నట్లు తెలిపారు. ఐదుగురు తాజా మాజీ సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు చేరారు. బాన్సువాడ నియోజక వర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందు రెడ్డి తదితరులున్నారు.

పలువురి చేరిక..

బాన్సువాడ రూరల్ : మండలంలోని పులికుచ్చతండాకు చెందిన పలువురు యువకులు, మహిళలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తండాలో పెండింగ్ పనులన్నీ పూర్తిచేయిస్తానని ఆయన హామీనిచ్చారు. తండా యువకులు, మహిళలతో సాంప్రదాయ నృత్యం చేశారు. నాయకులు నార్ల రత్నకుమార్, మోరీల్ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో జుక్కల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. యవజన కాంగ్రెస్ నాయకులు కాళోజి విఠల్ రావు, బస్వరాజ్ శ్రీనివాస్, రాంసింగ్, మల్లేశం,ఇస్మాయిల్,పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. సీఎం మెగా డీఎస్సీ ప్రకటించిన సందర్భంగా రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంపత్‌గౌడ్, అజర్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

అర్హులకే డబుల్ ఇళ్లు



బాన్సువాడ రూరల్ : ప్రభుత్వం ఈనెల 11నుంచి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల పథకాన్ని ప్రారంభించగానే, రాజారాం దుబ్బలోని అర్హులైన వారందరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజారాం దుబ్బ కాలనీలో పర్యటించి సమస్యలు తెల్సుకున్నారు. తాగునీటి సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. నాయకులు నార్ల రత్నకుమార్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్ తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కామారెడ్డి టౌన్ : వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని 15వ వార్డు కౌన్సిలర్ వనిత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని మంగళవారం సాయంత్రం అకస్మికంగా తనిఖీ చేశారు.

బీజేపీలో పలువురి చేరిక

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన ఎంపీటీసీ చాకలి సుజాత భర్త రమేశ్‌తో పాటు సింగితం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త అనిల్‌సేట్ బీజేపీలో చేరారు. మంగళవారం మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో వారు బీజేపీలో చేరారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు అశోక్‌రాజ్, బత్తిని జగదీశ్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

శివాలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. మహారాజ పోషకులు జాలిగామ నగేష్ లలిత, బొద్దుల దత్తేత్రేయ రుచిత, కొడిప్యాల శ్రీనివాస్ రుచిత, ఆకుల సత్యం పద్మ, పబ్బ రవీందర్ క్రిష్ణవేణిల ఆధ్వర్యంలో శివ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కాలభైరవుడికి సిందూర పూజలు



రామారెడ్డి(ఎల్లారెడ్డి) : ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడి ఆలయంలో మంగళవారం జలాభిషేకాలు, సిందూర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భజన చేశారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభుగుప్తా, అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీ కృష్ణ శర్మ, సురేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణానందస్వామీజీ జన్మదినం

కామారెడ్డి అర్బన్ : శ్రీరామ జపలిఖిత ప్రచారకులు, టేక్రియాల్ కృష్ణాశ్రమం కృష్ణానందస్వామి జన్మదినం సంబురాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో



ఘనంగా నిర్వహించి అన్నదానం చేశారు. వివిధ మఠాలకు చెందిన స్వామిజీలు సచ్చిదానంద, శివనందభారతి, నిర్మలానంద, సహాజనంద మహారాజ్, శ్రీనివాసస్వామి, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ కల్యాణోత్సవం..

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని మల్లికార్జున ఆలయంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గొల్లవాడ యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించి, అగ్గిగుండాల్లో నడుచుకుంటూ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం, యూత్ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాలు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి గోల్లవాడ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మలకు భక్తి శ్రద్ధలతో బోనాలు ఊరేగించి సమర్పించారు. ఎల్లమ్మకు పట్నాలు వేసి కథ వృత్తాంతం చెప్పించారు. యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దోమకొండ : మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో పనులను ప్రారంభించినట్లు ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఆసాని జ్యోతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామస్వామిగౌడ్, నాయకులు మడతల సత్యనారాయణ తదితరులున్నారు.

మహమ్మద్ నగర్‌లోని తుర్కిపల్లిలో..

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని తుర్కిపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకరంతో సీడీపీ నిధులతో అభివృద్ధిపనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుమ్మరి రాములు, సాయాగౌడ్, లింగాల నర్సింలు, కుమ్మరి భూమయ్య, రఘు తదితరులున్నారు.

నేడు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహడ్‌లోని రైతు వేదికలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభిస్తారన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

'గృహజ్యోతి'తో ఉచిత కరెంట్

నిజాంసాగర్(జుక్కల్): రేషన్ కార్డు కల్గి ఉన్న ప్రతీ ఇంటికి గృహ జ్యోతి పథకం ద్వారా జీరో బిల్లును లబ్దిదారు లు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండ లంలోని నర్వ గ్రామంలో గృహజ్యోతి జీరో బిల్లులను ట్రాన్స్‌కో అధికారులు, కాంగ్రెస్‌నాయకులు ఇల్లు, ఇల్లు తిరుగుతూ లబ్ధిదారులకు విద్యుత్ బిల్లు రసీదులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు చాకలి. డాకయ్య, యూసుబ్, మురళి ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ప్రారంభించారు. సబ్ ఇంజినీర్ సాయినాథ్ గౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామయ్య తదితరులున్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్, హైకోర్టు న్యాయవాది పి కృష్ణారెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహం హైదరాబాద్‌లో ఉంది. కుమారుడు, కుమార్తె విదేశాల నుంచి వచ్చిన తర్వాత అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిందితులను శిక్షించాలి

కామారెడ్డి టౌన్ : పశ్చిమబెంగాళ్‌లోని సందేశ్ కాళీలో మహిళలపై జరిగిన లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.